ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

సోమవారం 07-09-2026

మొదటి పేజి తరువాయి

## ఏపీలోని ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

విపత్తుల నిర్వహణ సంస్థ తన ప్రకటనలో పేర్కొంది. వర్ష తీవ్రత, పిడుగుపాటు ప్రమాదం అధికంగా ఉండటంతో ఇంతకుముందు జారీ చేసిన ఆరెంజ్ అలర్ట్‌ను తాజాగా రెడ్ అలర్ట్‌గా సవరించినట్లు వెల్లడించింది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఆకస్మిక మార్పుల దృష్ట్యా ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ముఖ్యంగా రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు, వాహనదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు కోరారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతున్నప్పుడు చెట్లు, విద్యుత్ స్తంభాల కింద, శిథిల భవనాల్లో ఆశ్రయం పొందవద్దని హెచ్చరించారు. ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశమే లక్ష్యం

ఈ పోరాటాన్ని జాతీయ భద్రతకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశంగా తీసుకుంది" అని అమిత్ షా అన్నారు. పక్కా ప్లాన్ తో డ్రగ్స్ నివారణ 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారతే మా లక్ష్యం. అందుకే డ్రగ్స్ అక్రమ రవాణా, నిధుల సమీకరణ నుంచి పునరావాసం వరకు మొత్తం మాదక ద్రవ్యాల నెట్ వర్క్ ను నిర్మూలించడానికి కేంద్రం ఒక పక్కా వ్యూహాన్ని అవలంబిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక మాదక ద్రవ్యాల నిరోధక టాస్క్ ఫోర్స్ లను (ఏఎన్ టీఎఫ్ ) ఏర్పాటు చేశాం. స్థానిక పోలీసులను జాతీయ వ్యూహంతో అనుసంధానించాం. అంతేకాదు మాదక ద్రవ్యాల నియంత్రణ బ్యూరో కేడర్ ను పునర్వ్యవస్థీకరించి, దాని సిబ్బందిని, కార్యాచరణ సామర్థ్యాలను పెంచడం ద్వారా బలోపేతం చేశామని అమిత్ షా చెప్పారు. "మా ప్రభుత్వం మాదక ద్రవ్యాల నిరోధక ప్రచారం చేస్తుంది. అవగాహన, చికిత్స, కౌన్సిలింగ్ , పునరావాసం, జీవనోపాధి అవకాశాలను అనుసంధానిస్తాం. అంతేకాదు డ్రగ్స్ కు బానిసలైన వ్యక్తులకు మద్దతు ఇవ్వడానికి 1933 మానస్ హెల్ప్ లైన్ ను ప్రవేశపెట్టాం. ఈ రాజకీయ సంకల్పం, సమన్వయంతో కూడిన చర్యలతో 2029 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ ను సాధించడమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తోంది" అని అమిత్ షా స్పష్టం చేశారు.

### మా పాలనలో కశ్మీర్ ప్రశాంతం!

ప్రధాని మోదీ హయాంలో జమ్మూకశ్మీర్ ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందని అమిత్ షా అన్నారు. అందుకే ఇప్పుడు ఆ ప్రాంతం అభివృద్ధి సాధిస్తూ, ప్రగతి పథంలో పయనిస్తోందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్ లో వేర్పాటువాద భావనలు తగ్గాయని ఆయన అన్నారు. దేశ అంతర్గత భద్రతను మరింత మెరుగుపర్చడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

### నక్సలిజం ఇప్పుడు గతమైపోయింది!

ఐదు దశాబ్దాలుగా దేశాన్ని పీడించిన నక్సలిజం ఇప్పుడు గతంగా మారిపోయిందని అమిత్ షా అన్నారు. "తిరుపతి నుంచి పశుపతినాథ్ వరకు 'రెడ్ (మావోయిస్టు) కారిడార్ ' నిర్మించాలని కలలు కన్నవారు, నేడు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో చేరారు. ఈశాన్య రాష్ట్రాలు కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాయి. అక్కడ 11వేల మందికి పైగా యువకులు ఆయుధాలు విడిచిపెట్టారు. మేము కన్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. మాదక ద్రవ్యాల ముప్పును కూడా అదే పద్ధతిలో ఎదుర్కొంటాం" అని అమిత్ షా స్పష్టం చేశారు.

### పరారీలో ఉన్న నేరస్తులను వెనక్కి రప్పిస్తాం!

2029 మార్చి నాటికి 100 జాతీయ, అంతర్జాతీయ నెట్ వర్క్ లను ధ్వంసం చేయడం, 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడమే కేంద్రం లక్ష్యమని అమిత్ షా చెప్పారు. మార్చి 2029 నాటికి 100 జాతీయ మరియు అంతర్జాతీయ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయడం మరియు 100 మంది పరారీలో ఉన్న నేరస్తులను దేశానికి తిరిగి తీసుకురావడం కేంద్రం లక్ష్యమని షా చెప్పారు. విదేశాల్లో దాక్కున్న, పరారీలో ఉన్న నేరస్తులను తిరిగి తీసుకురావడం కోసం తమ ప్రభుత్వం మిషన్ -మోడ్ విధానంతో ముందుకు వెళ్తోందని అన్నారు. 2019 జులై నుంచి 2026 జులై మధ్య కాలంతో 36 దేశాల నుంచి 274 మంది మోస్ట్ వాంటెడ్ నేరస్థులను భారతదేశానికి తిరిగి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు.

## రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న తెలుగు టీచర్ ప్రకాశరావు!

అక్కడే ఉన్నత విద్యను పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించారు. అండమాన్ నికోబార్ దీవుల్లో తెలుగు బోధనతో పాటు విద్యార్థుల అభ్యున్నతికి విశేష సేవలందిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆయనకు పురస్కారం లభించడంతో చెన్నడం గ్రామస్థులు, విద్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

## కొడంగల్‌పై కవిత ఫోకస్.. కోస్గిలో పాంచజన్య సంకల్ప సభ

పాంచజన్య సంకల్ప సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు.

### బహుజన తెలంగాణ సాధనే మా లక్ష్యం..

సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ హామీలను అమలు చేయడంలో విఫలమైందని కవిత విమర్శించారు. ఆరు గ్యారంటీల్లో సగం కూడా ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. బహుజన తెలంగాణ సాధనే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. తెలంగాణ రక్షణ సేనలో బీజేపీ కొడంగల్ ఇన్‌చార్జి ప్రభాకర్ కులకర్ణి చేరారు. కులకర్ణితో పాటు ఆయన అనుచరులకు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కవిత నాయకత్వంలో బహుజన తెలంగాణ కోసం పనిచేస్తానని ప్రభాకర్ కులకర్ణి పేర్కొన్నారు.

## ఐక్యరాజ్యసమితి కొత్త ప్రపంచ మ్యాప్ కు భారత్ ఓకే...

శతాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా వాడుకలో ఉన్న 'మెర్కేటర్ ప్రొజెక్షన్' మ్యాప్ ల్లో భూమధ్యరేఖకు దూరంగా ఉన్న ప్రాంతాలు వాస్తవం కంటే పెద్దవిగా కనిపిస్తాయి. ఉదాహరణకు, ఆఫ్రికా కంటే 14 రెట్లు చిన్నదైన గ్రీన్‌ల్యాండ్, ఈ మ్యాప్ ల్లో దాదాపు ఆఫ్రికా సైజులోనే కనిపిస్తుంది. ఈ వక్రీకరణను సరిదిద్దేందుకు 'ఈక్వల్-ఏరియా' (సమాన విస్తీర్ణం) ప్రొజెక్షన్‌లను ప్రోత్సహించాలని కోరుతూ 'కరెక్ట్ ది మ్యాప్' పేరుతో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనివల్ల ఆఫ్రికా, భారత్ వంటి గ్లోబల్ సౌత్ దేశాలు వాటి వాస్తవ పరిమాణంలో కనిపిస్తాయి. సెప్టెంబర్ 4న జరిగిన ఓటింగ్‌లో ఈ తీర్మానానికి అనుకూలంగా 164 దేశాలు ఓటు వేయగా, అమెరికా వ్యతిరేకించింది. మరో 6 దేశాలు ఓటింగ్‌లో పాల్గొనలేదు. ఈ ఓటింగ్‌పై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. ఖండాల వాస్తవ పరిమాణాన్ని చూపించే సూత్రానికి మాత్రమే తాము మద్దతిస్తున్నామని, దీనివల్ల ఏదో ఒక నిర్దిష్ట మ్యాప్ ను (ఈక్వల్ ఎర్త్ వంటివి) ఆమోదిస్తున్నట్లు కాదని తెలిపారు. ఈ తీర్మానానికి, రాజకీయ సరిహద్దులకు, వివాదాస్పద ప్రాంతాలకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. భారత సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని భారత్ తేల్చిచెప్పింది. కేంద్ర పాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లధఖ్‌లతో కూడిన భారత భూభాగాన్ని, దేశ అధికారిక మ్యాప్ ప్రకారమే కచ్చితంగా చూపించాలని ఉద్ఘాటించింది. దీనికి భిన్నంగా చిత్రీకరించే ఎలాంటి ప్రయత్నాన్నైనా అంగీకరించబోమని పేర్కొంది. ఈ తీర్మానం దేశాలపై చట్టపరంగా తప్పనిసరి కానప్పటికీ, వాస్తవ సైజులు ముఖ్యమైన చోట ఈక్వల్-ఏరియా మ్యాప్ లను వాడాలని ప్రభుత్వాలను, సంస్థలను ప్రోత్సహిస్తుంది.

## ఒళ్లంతా అవినీతి బురదే!

భారతావని సమైక్యతను పరిరక్షించే ఉక్కుచట్రంగా సివిల్ సర్వీసులు వెలుగొందాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశించారు. కానీ, ప్రజాసేవను పక్కనపెట్టి తప్పుడుదోవల్లో తమ జేబులు నింపుకోవడానికి తహతహలాడుతున్న కొందరు అవినీతి ఉన్నతాధికారుల పుణ్యమా అని ఆ ఉక్కుచట్రం క్రమంగా తుప్పుపడుతోంది. లంచాల మేతలకు అలవాటుపడిన పెద్దమనుషుల దెబ్బకు తన స్వరూప స్వభావాలనే కోల్పోతోంది. ఉద్యోగంలోకి రాకమునుపు సమాజ సేవకుల్లా నీతిసూత్రాలు చెబుతూ రాజ్యాంగ విధేయత, పారదర్శక పాలన, పేదరిక నిర్మూలన అంటూ తెగ కలవరించే కొంతమంది- సివిల్ సర్వీసుల్లోకి రాగానే ఆదర్శాలకు చెల్లుచీటీ రాస్తున్నారు. నిర్లజ్జగా అక్రమాలకు పాల్పడుతూ ఉన్నతాధికార స్థానాలపై సమాజంలో ఉండే గౌరవమర్యాదలను నీరుగారుస్తున్నారు. మంచి వేతనం, పెద్ద బంగ్లా, కారు, భద్రత, వ్యక్తిగత సిబ్బంది... అసలు ఐఏఎస్, ఐపీఎస్ అంటేనే ఆ దర్జానే వేరు. ఆ ఆర్భాటాల మాయలో పడిన వారు ప్రజలకు దూరమవుతారు. అలాకాకుండా తమ చేతిలోని అధికారాన్ని సామాన్యుల కోసం సద్వినియోగం చేస్తే, జనం వారిని గుండెల్లో పెట్టుకుంటారు. కానీ, అలా సమాజానికి ఉపయోగపడదామన్న ఆలోచనే కొందరిలో ఉండట్లేదు. అరుదైన అవకాశాన్ని అందించిన దేశానికి రుణపడి ఉంటూ పేదసాదల బతుకులను మార్చడానికి తామేం చేయాలన్న తలపును కూడా వారు దగ్గరికి రానివ్వట్లేదు. ఎంతసేపూ ఎంతెంత సంపదను కూడగట్టుకుందామా అన్నదానిపైనే వాళ్ల దృష్టి అంతా ఉంటోంది. హరియాణాలో భారీ ఆర్థిక నేరం కేసులో సీబీఐ తాజాగా ఆరుగురు ఐఏఎస్‌లపై మూడో ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో బ్యాంకు అధికారులు, ఇతర ప్రభుత్వ సిబ్బందితో ఐఏఎస్‌లు కుమ్మక్కు అయ్యి హరియాణా ప్రభుత్వ శాఖలు, సంస్థలకు చెందిన దాదాపు ఆరు వందల కోట్ల రూపాయల నిధులను దారిమళ్లించారని చెబుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది సక్రమ మార్గంలో నడిచేలా చూడాల్సినవారే ఇలా బుద్ధిగడ్డి తిని ప్రజాధనాన్ని స్వాహా చేయడమెంత సిగ్గుచేటు! రాజస్థాన్ జల్‌జీవన్ మిషన్ టెండర్లలో అవకతవకలకు పాల్పడ్డారంటూ మాజీ ఐఏఎస్ అధికారి సుబోధ్ అగర్వాల్‌ను ఏసీబీ ఇటీవల అరెస్టు చేసింది. గతంలో ఈయన అదనపు ప్రత్యేక కార్యదర్శిగా ఉద్యోగం వెలగబెట్టారు. అవినీతి ఆరోపణలు గుప్పుమన్నాక చాలారోజులు పరారీలో ఉన్నారు. అడుసు తొక్కనేల.. కాలు కడగనేల అన్నట్లు అడ్డగోలు మార్గాల్లో డబ్బు వెనకేసుకోవడానికి అర్రులుచాచకుండా ఉంటే దొంగలా బతకాల్సిన అగత్యం తప్పేది కదా! కర్ణాటకలో పశువైద్యాధికారుల పోస్టుల మంజూరుకు లంచాలు కతికిన కేసులో ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్రకుమార్‌ను సీఐడీ అదుపులోకి తీసుకుంది. అయిదు వేల కోట్ల రూపాయల నకిలీ మందుల రాకెట్ దర్యాప్తును ఒక వ్యాపారికి అనుకూలంగా మార్చేందుకు రూ.3కోట్ల లంచం అడిగిన ఆరోపణ మీద హరియాణా క్యాడర్ ఐపీఎస్ అధికారి దీపక్ గహ్లోవత్‌ను మొన్న జులైలో సీబీఐ అరెస్టు చేసింది. సామాన్య ప్రజల ప్రాణాలతో ముడిపడిన కేసుల్లోనూ ఇలా అవినీతి దారులు వెతకడం ఎంత హేయం!

## అందనంత దూరంలో మీరు- అందుకే ప్రచారాలు అవసరం'

మొదటి పేజి తరువాయి

### మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

### ఈ సమస్యల గురించి మాట్లాడరేం!

యువత రిపోర్ట్ కార్డులో పెరుగుతున్న నిరుద్యోగం, ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న ప్రభుత్వ నియామకాలు, పేపర్ లీక్ లు, ఖరీదైన విద్య, తగ్గిపోతున్న స్కాలర్ షిప్ అవకాశాలు, విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిపై పెరుగుతున్న ఒత్తిడి లాంటివి ఉన్నాయని ఖర్గే పేర్కొన్నారు. "మోదీ- మీరు అందనంత దూరంలో ఉన్నప్పుడే మీకు ప్రత్యేక పరిచయ కార్యక్రమం అవసరం అవుతుంది. మోదీ తన రిపోర్టు కార్డు చూపించారు. దేశ యువత కూడా తన రిపోర్టు కార్డుతో సిద్ధంగా ఉంది. ఆ రిపోర్టు కార్డులో నిరుద్యోగం, ఏళ్ల తరబడి నిలిచిపోయిన ప్రభుత్వ నియామకాలు, పేపర్ లీక్ లతో ఇబ్బందిపడుతున్న విద్యార్థులు, రోజురోజుకూ ఖరీదు అవుతున్న విద్య, తగ్గిపోతున్న స్కాలర్‌షిప్ అవకాశాలు, యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిపై



పెరుగుతున్న ఒత్తిడి మొదలైనవి ఉన్నాయి. అందుకే విద్యార్థుల గొంతుక వినండి. సమస్యను పక్కదారి పట్టించడం వల్ల అవి పరిష్కారం కావు" అని ఖర్గే ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### యాంగ్రీ అంకుల్స్

శనివారం ప్రధాని మోదీ శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది ఉత్సవాలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యక్రమాలను విమర్శించేవారిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని వ్యతిరేకించేవారిని 'యాంగ్రీ అంకుల్స్ ' అని అభివర్ణించారు. మోదీ ఎస్ ఆర్ సీసీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఈ క్యాంపస్ వెలుపల, మీకు ఒక కొత్త ప్రపంచం కనిపిస్తుంది. మీరు రెండు రకాల వ్యక్తులను కలుస్తారు. మొదటి రకం వారు సమాజం శక్తిని దేశ శక్తిగా మార్చే వ్యక్తులు. ఇక రెండో రకం వాళ్లు ఏ పని ప్రారంభమైనా యాంగ్రీ అంకుల్ లాగా మారిపోతారు. ప్రతి పనిని వ్యతిరేకించడమే వారి పని. వారికి ఒకే ఒక డైలాగు తెలుసు- 'దీని అవసరం ఏముంది?'. మేము ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహాన్ని (స్టాట్యూ ఆఫ్ యూనిటీ) నిర్మిస్తున్నప్పుడు, కొందరు ఫూఫాలు (అసంతృప్తితో ఉండే బంధువులు) దీని అవసరం ఏముందని అన్నారు. మేము హైస్పీడ్ రైళ్లు, యూపీఐ ప్రారంభించినప్పుడు కూడా అలానే అన్నారు. కానీ వారందరికీ భారతదేశం తగిన సమాధానం ఇచ్చింది. దేశానికి అవసరమైన పనిని చేయడానికి భారతదేశాన్ని ఎవరూ ఆపలేరు" అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీపై ఖర్గే విమర్శలు గుప్పించారు.

## తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు - పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు

మొదటి పేజి తరువాయి

స్వామివారిని దర్శించుకుని, వాహన సేవలను తిలకించేలా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ సీవీఎస్‌వో మురళీకృష్ణ తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల నాలుగు మాడ వీధులతో పాటు, భక్తులు రద్దీగా ఉండే ఇతర ప్రాంతాల్లో చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీఎస్‌వో మాట్లాడుతూ గత బ్రహ్మోత్సవాల అనుభవాలను, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత పటిష్ఠమైన వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రత కల్పిస్తారని స్పష్టం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాహన సేవలను తిలకించేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ధ్వజారోహణం రోజున సీఎం పర్యటన: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 15న ధ్వజారోహణం సేవ జరగనుంది. ఆ రోజున సీఎం చంద్రబాబు తిరుమలకు విచ్చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక బందోబస్తుతో పాటు అవసరమైన చోట్ల బ్యారికేడింగ్‌ను నిర్మిస్తున్నారు. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో భద్రతా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు. గరుడ సేవకు భారీ ఏర్పాట్లు: సెప్టెంబర్ 19న గరుడసేవకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది. అందువల్ల తిరుమల, తిరుపతిలోని పార్కింగ్ ప్రాంతాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు సీవీఎస్వో తెలిపారు. వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ట్రాఫిక్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. అలాగే, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు సులభంగా మార్గనిర్దేశం చేసేందుకు తిరుమల, తిరుపతి ప్రధాన కూడళ్లలో వివిధ భాషల్లో సైన్ బోర్డులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రణాళికాబద్ధంగా పటిష్ఠ బందోబస్తు: శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. భక్తుల భద్రతతో పాటు క్రైమ్, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. టీటీడీ విజిలెన్స్, పోలీస్, ఫైర్, ఫారెస్టు, ఇంటెలిజెన్స్, ఆర్టీసీ, రైల్వే తదితర శాఖల సమన్వయంతో బ్రహ్మోత్సవాల సమయంలో భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల షెడ్యూల్ : ఈ ఏడాది అధిక మాసం కారణంగా తిరుమలలో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక



ఆనందంలో పరవశింపజేయనున్నాయి. ఇందుకు సంబంధించి టీటీడీ అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. సెప్టెంబరు 15 నుంచి 23వ తేదీ వరకు నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబరు 12 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. సెప్టెంబరు 14వ తేదీ సాయంత్రం అంకురార్పణతో వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు నిర్వహించనున్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన డిజాస్టర్, అట్టర్ ఫ్లాప్

మొదటి పేజి తరువాయి

: తమ ప్రభుత్వం పోవడం ఖాయమని కాంగ్రెస్ నేతలకు అర్థమైందన్న కేసీఆర్ , అందువల్లనే అడ్డగోలు దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. పాలన చేతకాకే సీఎం రేవంత్ రెడ్డి అభ్యంతరకరంగా బూతుపురాణం చేస్తున్నారని, అలాంటి వారితో చర్చలకు అసెంబ్లీకి రావాలా? అని నిలదీశారు. తన చావు కోరుతూ పదేపదే స్పీచ్‌లు ఇస్తున్నారని, అసెంబ్లీకి రావాలని ధర్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలి : కృష్ణా, గోదావరి నదీ జలాల అంశంపై ఉధృతమైన పోరాటం చేయాలని బీఆర్ఎస్ సభ్యులకు కేసీఆర్ తెలిపారు. ఉద్దేశపూర్వకంగా రైతులకు సాగునీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోందని, రాజకీయాల కోసం అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టారని విమర్శించారు. ప్రాజెక్టుల పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల దగ్గరకు వెళ్దామని, నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుందని అన్నారు. అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో ప్రభుత్వంపై గట్టిగా పోరాడాలని




ఆదేశించారు. సమావేశంలో తన గురించే ఎక్కువ మాట్లాడే ప్రయత్నం చేస్తారని, పట్టించుకోకూడదని పేర్కొన్నారు. ఉభయసభల్లో ఎండగట్టాలి : అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలని, శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని బీఆర్ఎస్ సభ్యులకు కేసీఆర్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలను ఎవరూ తేలిగ్గా తీసుకోవద్దని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలని, స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలు ఎండగట్టాలని, ఉభయసభల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆదేశించారు. అసెంబ్లీలో ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలని వెల్లడించారు.

### కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల పక్షాన మాట్లాడాలి

కూడా 22 ఏ లో పెట్టలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలోని దళిత, గిరిజనుల, నోరు లేని అమాయకులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహించారు. దాదాపు లక్ష కోట్ల పేదల భూములను 22ఏలో పెట్టి భారీ కుంభకోణానికి తెర లేపారని ఆరోపించారు. లక్ష కోట్ల భూముల పంచాయితీలో పైసలు పంచుకుంటున్న మంత్రులు ఎవరో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. లేదా ఈ పైసలన్నీ తన ఖాతాలోనే వేసుకుంటానని అనుకుంటే సీఎం అయినా దీనికి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. 22 ఏ లో పేదల భూములను పెట్టొద్దని.. అవి తాతల కాలం నాటి నుంచి వస్తున్న ఆస్తులని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ ఈసారి జరిగే శాసనసభ సమావేశాలకు హాజరు కావాలని కోరారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి గజ్వేల్ ప్రజల పక్షాన మాట్లాడితే వారికి గౌరవం ఉంటుందని రఘునందన్ రావు సూచించారు.

## ఢిల్లీలో కుప్పకూలిన ఐదంతస్తుల భవనం.. ఒకరి మృతి

మొదటి పేజి తరువాయి

ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 40-50 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ సీఎం అతిషి కూడా ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని ఆమె పేర్కొన్నారు. సమీపంలోనే ప్రచారం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్, తాము ఘటనాస్థలికి చేరుకుని ముగ్గురిని కాపాడామని తెలిపారు. ప్రమాద స్థలంలో విద్యార్థులకు చెందిన పుస్తకాలు కనిపించాయని, ప్రభుత్వ వైఫల్యమే ఈ దుర్ఘటనకు కారణమని ఆరోపించారు. ప్రమాదం జరిగిన భవనం పక్కనే ఉన్న పీజీలో నివసించే ఓ విద్యార్థి మాట్లాడుతూ, "భోజనం చేశాక ఒక్కసారిగా భూకంపం వచ్చినట్లు భవనం



కంపించింది. బాల్కనీలోకి వచ్చి చూస్తే అంతా దుమ్ముతో నిండిపోయింది. కిందకు దిగాక భవనం కూలిందని అర్థమైంది. అధికారుల కంటే ముందే మేం ఒకరిని శిథిలాల నుంచి బయటకు లాగాం" అని తెలిపారు. మరో ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ, ఇంకా 20-30 మంది శిథిలాల కింద చిక్కుకొని ఉండవచ్చని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

## హైదరాబాద్‌లో 'అహింసా స్థూపం'.. ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

మొదటి పేజి తరువాయి

ఢిల్లీ : కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో 'అహింసా స్థూపం' ఆవిష్కరించారు. శాంతి, అహింస అనే గొప్ప సందేశాన్ని సమాజంలో మరింత బలంగా చాటిచెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఇది కేవలం ఒక కట్టడం ఆవిష్కరణ కాదని, శాంతి, అహింస వంటి కాలాతీతమైన సిద్ధాంతాలను పరిరక్షించి, భవిష్యత్ తరాలకు అందించే గొప్ప ప్రయత్నమని స్పష్టం చేశారు. భగవాన్ మహావీరుడి సందేశమైన 'పరస్పరోపగ్రహో జీవానామ్' అనే సూక్తికున్న ప్రాధాన్యతను ఆయన వివరించారు. 'జీవులన్నీ పరస్పర మద్దతు, సహకారంతో ముడిపడి ఉంటాయి' అని దీని అర్థమని, ఈ సూక్తిని స్థూపంపై చెక్కారని తెలిపారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో హింస, ఘర్షణలు కొనసాగుతున్న తరుణంలో పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం అనే సందేశం ఎంతో అవసరమని ఆయన నొక్కిచెప్పారు. భారత్ ఎల్లప్పుడూ అహింసా మార్గాన్నే అనుసరించిందని, కశ్మీర్‌లో హింసకు ముగింపు పలికి, శాంతిని పునరుద్ధరించడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అహింస అనేది బలహీనత కాదని, అదొక గొప్ప బలమని అన్నారు. అహింసా స్థూపం ఏర్పాటుకు చొరవ తీసుకోవడం ద్వారా 'నారీశక్తి' స్ఫూర్తిని, మహిళా నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధిని ఇది ప్రతిబింబిస్తోందని ప్రశంసించారు. ఈ




కార్యక్రమాన్ని నిర్వహించిన జైన సమాజ మహిళలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలే అభివృద్ధికి చోదకశక్తిగా నిలుస్తున్నారని, శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే 'నారీశక్తి వందన్ అధినియమ్' ఇందుకు నిదర్శనమని తెలిపారు. హైదరాబాద్ విభిన్న సంస్కృతులకు నిలయమని, నగరం సాధిస్తున్న ప్రగతి వెనుక ఈ వైవిధ్యమే కీలక శక్తిగా ఉందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహానగర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అభివృద్ధిలో జైన, బ్రాహ్మణ, మహేశ్వరి వంటి వర్గాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. 'వికాస్ భీ, విరాసత్ భీ' (అభివృద్ధితో పాటు వారసత్వం) అనే స్ఫూర్తితో 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనలో హైదరాబాద్ ముఖ్యపాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్న స్వార్థ శక్తులను ఓడించడానికి అందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. నేటి యువత (జెన్-జీ) సాంకేతికతతో ప్రపంచాన్ని జయించాలని, అదే సమయంలో భారతీయ సాంస్కృతిక విలువలను ఎన్నడూ విస్మరించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కె. విశ్వేశ్వర్ రెడ్డి, జైన సమాజ ప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్‌లో ముసలి ముత్యాలమ్మ తల్లి మహా జాతర.. భక్తి ప్రభంజనం

## -500 వరకు ట్రాక్టర్లతో భారీ ఊరేగింపు.. బోనమెత్తిన వేలాది మహిళలు.. డప్పుల మోతకు యువత ఫుల్ డ్యాన్స్.. పోతరాజుల సందడితో మార్మోగిన పట్టణం

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 6,ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :

ముసలి ముత్యాలమ్మ తల్లి మహా జాతరతో హుజూర్‌నగర్ పట్టణం భక్తి సంద్రంగా మారింది. ఆదివారం జరిగిన జాతర అంగరంగ వైభవంగా, అపూర్వ భక్తిశ్రద్ధల మధ్య కన్నుల పండువగా సాగింది. తెల్లవారుజాము నుంచే పట్టణంలోని ప్రధాన వీధులు భక్తులతో కిక్కిరిసిపోగా.. అమ్మవారి దర్శనం కోసం హుజూర్‌నగర్‌తో పాటు పరిసర గ్రామాలు, ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించడంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

**500 వరకు ట్రాక్టర్లు.. భారీ ఊరేగింపుతో జాతర వైభవం :**

ముత్యాలమ్మ తల్లి జాతరలో నిర్వహించిన భారీ ఊరేగింపు ఈ ఏడాది ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సుమారు 500 వరకు ట్రాక్టర్లు ఊరేగింపులో పాల్గొనడంతో హుజూర్‌నగర్ పట్టణ ప్రధాన రహదారులు జాతర సందడితో నిండిపోయాయి. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లు వరుసగా కదులుతుండగా వాటి వెంట భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ట్రాక్టర్లపై ఏర్పాటు చేసిన అలంకరణలు, ప్రభలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

డప్పుల మోతలు, భక్తుల జైకారాలు, పోతరాజుల సందడి, బోనాలతో తరలివచ్చిన మహిళలతో ఊరేగింపు అత్యంత ఉత్సాహభరితంగా సాగింది. ఎటుచూసినా భక్తుల సందడి, డప్పుల శబ్దాలు, అమ్మవారి నామస్మరణతో హుజూర్‌నగర్ పట్టణం మార్మోగిపోయింది.

**డప్పుల దరువులకు యువత ఫుల్ డ్యాన్స్.. అదిరిపోయిన సందడి:**

జాతర ఊరేగింపులో యువత ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డప్పుల దరువులు మోగుతుండగా యువత పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చి ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. డప్పుల శబ్దానికి అనుగుణంగా యువత ఫుల్ డ్యాన్స్ చేస్తూ జాతరలో జోష్ నింపారు. ఒకవైపు మహిళల బోనాలు.. మరోవైపు పోతరాజుల సందడి.. ఇంకోవైపు డప్పుల మోతకు యువత నృత్యాలు.. ఇలా హుజూర్‌నగర్ వీధులు ఉత్సాహంతో హోరెత్తాయి.

యువతతో పాటు భక్తులు కూడా ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొని జైకారాలు చేస్తూ జాతర వైభవాన్ని మరింత పెంచారు. డప్పుల దరువులు, నృత్యాలు, భక్తుల సందడి కలిసి జాతరను కన్నుల పండువగా మార్చాయి.

**బోనమెత్తిన మహిళల భక్తి.. పోతరాజుల సందడి :**

మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకుని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాది మంది మహిళలు బోనాలతో తరలిరావడంతో జాతరలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

పోతరాజుల సందడి, డప్పుల దరువులు, భక్తుల జైకారాలు జాతర ఉత్సాహాన్ని మరింత పెంచాయి. అమ్మవారి ఆశీస్సులు తమ కుటుంబాలపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.

**ఉమ్మడి నల్లగొండలో ప్రత్యేక గుర్తింపు :**



ముసలి ముత్యాలమ్మ తల్లి జాతరకు ఏటా పెరుగుతున్న ఆదరణ ఈ ప్రాంతంలో అమ్మవారిపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది. భారీ ఊరేగింపు, వేలాది మంది మహిళల బోనాల సమర్పణ, సంప్రదాయ కార్యక్రమాలు, పోతరాజుల సందడి, డప్పుల మోత, యువత నృత్యాలతో జాతర తన ప్రత్యేకతను చాటుకుంది.

ఉమ్మడి నల్లగొండ ప్రాంతంలో ప్రత్యేక గుర్తింపు పొందిన జాతరగా ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలు నిలుస్తున్నాయి. జాతరకు వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతుండటంతో భవిష్యత్‌లో మరింత విస్తృత స్థాయిలో నిర్వహించాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

**భారీ బందోబస్తు.. ప్రశాంతంగా సాగిన జాతర :**

జాతరకు భారీగా భక్తులు, వందలాది ట్రాక్టర్లు తరలిరావడంతో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాలు, ప్రధాన రహదారులు, ఊరేగింపు మార్గాల్లో పోలీసు సిబ్బంది పర్యవేక్షణ చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు.

**వర్షపు జల్లులతో మరింత ఆహ్లాదకరంగా మారిన వాతావరణం :**

జాతర సందర్భంగా కురిసిన వర్షంతో వాతావరణం మరింత ఆహ్లాదకరంగా మారింది. వర్షాన్ని అమ్మవారి కరుణగా భావించిన భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. ముత్యాలమ్మ తల్లి కటాక్షంతో పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని భక్తులు ప్రార్థించారు.

మొత్తంగా బోనమెత్తిన వేలాది మంది మహిళలు.. 500 వరకు ట్రాక్టర్ల భారీ ఊరేగింపు.. పోతరాజుల సందడి.. డప్పుల మోత.. యువత ఫుల్ డ్యాన్స్.. భక్తుల జైకారాలు.. భారీ జనసందోహం.. వర్షపు జల్లులు కలగలిసి ముసలి ముత్యాలమ్మ తల్లి జాతరను హుజూర్‌నగర్‌లో భక్తి ప్రభంజనంగా నిలిపాయి. భక్తి, సంప్రదాయం, ఉత్సాహం, ప్రజల ఐక్యతకు ప్రతీకగా జరిగిన ఈ మహా జాతర హుజూర్‌నగర్ ప్రత్యేకతను మరోసారి చాటిచెప్పింది.

# రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

## నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి అధికారులకు కీలక సూచనలు

**(చిలుకూరు మండల )సెప్టెంబర్ 6, ప్రజా న్యూస్ నెట్‌వర్క్,షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి**

సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం సీతారాంపురం సమీపంలో సుమారు రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ ప్రదేశానికి చేరుకున్న మంత్రి పాఠశాల భవనాలు, మౌలిక వసతులు, ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో పాటు కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం ద్వారా విద్యార్థులకు ఆధునిక విద్యా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, నాణ్యమైన విద్యకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాల నిర్మాణంలో చేపడుతున్న పనుల వివరాలు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, తదుపరి దశలో చేపట్టాల్సిన పనులపై మంత్రి సమగ్రంగా ఆరా తీశారు.

**నాణ్యతలో రాజీ లేకుండా పనులు పూర్తి చేయాలి :**

నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించి చేపడుతున్న ప్రతిష్టాత్మక విద్యా సంస్థ నిర్మాణంలో ఎక్కడా నిర్లక్ష్యానికి తావు లేకుండా పనులు చేపట్టాలని సూచించారు. నిర్మాణ సామగ్రి నాణ్యత, పనుల ప్రమాణాలు, మౌలిక వసతుల ఏర్పాటును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

పనులు నిర్ణీత ప్రణాళిక ప్రకారం వేగవంతంగా కొనసాగించాలని, నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా నిర్మాణ ప్రణాళికను అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా నిర్మాణ ప్రాంగణంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. పాఠశాల నిర్మాణం పూర్తయిన



అనంతరం విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నర్సింహా, సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. భారీ స్థాయిలో చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను మంత్రి స్వయంగా పరిశీలించడం ద్వారా పనుల పురోగతి, నాణ్యతపై అధికారులు మరింత దృష్టి సారించే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు.

# తెలంగాణ వ్యవసాయ మార్కెట్ దడువాయి సదస్సును విజయవంతం చేయాలి :

## -సూర్యాపేట మార్కెట్ యూనియన్ ఉపాధ్యక్షులు రేగట్టి సందీప్ గౌడ్

**(సూర్యాపేట మండలం), ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**



హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం నిర్వహించనున్న తెలంగాణ వ్యవసాయ మార్కెట్ దడువాయి యూనియన్ సదస్సును విజయవంతం చేయాలని సూర్యాపేట మార్కెట్ యూనియన్ ఉపాధ్యక్షులు రేగట్టి సందీప్ గౌడ్ పిలుపునిచ్చారు. సదస్సుకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. యూనియన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

# కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలి కాంగ్రెస్ ధర్నా

**కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.6 ప్రజా న్యూస్ నెట్వర్క్**



కేసీఆర్ ప్రతిపక్ష నేతగా ప్రజల సమస్యలపై బాధ్యత వహించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ, ఆయన వెంటనే ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన భారీ ధర్నా కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారుఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన డీసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ ఎన్ టి యు సి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విభాగాల నాయకులు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# గిరిజన కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



అనంతసాగరం 06 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :

అనంతసాగరం: మండలంలోని పడమటి కంభంపాడు గిరిజన కాలనీలో తాగునీటి సమస్య తీర్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కాలనీలోని చేతి పంపు నుంచి రంగు మారిన నీరు వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై స్పందించిన ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ ఆదేశాల మేరకు అధికారులు కాలనీకి చేరుకుని నీటి నమూనాలను వాటర్ శాంపిల్స్ సేకరించారు. కాలనీవాసులకు ఎలాంటి నీటి ఇబ్బందులు లేకుండా త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని అసిస్టెంట్ ఎంపీడీవో రామచంద్రయ్య హామీ ఇచ్చారు.



# మైత్రి డెంటల్ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమం

కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.6 ప్రజా న్యూస్ నెట్వర్క్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ పరిధి గోదావరి హోమ్స్ గౌతమ్ మోడల్ స్కూల్ వద్ద డా.మైత్రి రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన మైత్రి డెంటల్ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కట్ చేసి క్లినిక్ ని ప్రారంభించిన బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి

ఈ కార్యక్రమం లో నల్లనాగుల కృష్ణ,నార్లకంటి ప్రతాప్,పెద్దింటి సాయిలు,సతీష్ చక్రవర్తి,శ్రీకాంత్ రెడ్డి,శ్రవణ్ బోస్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

## పోక్సో చట్టం కింద కేసు నమోదు.. నిందితులకు రిమాండ్



(హుజూర్‌నగర్ మండలం), సెప్టెంబర్ 6, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి: హుజూర్‌నగర్ మండల పరిధిలోని ఓ గ్రామంలో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారనే కేసులో ఇద్దరు 19 ఏళ్ల యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. నిందితులను కాంపాటి విరామ్ రాము, పాముల ఆకాష్‌గా పోలీసులు గుర్తించినట్లు సీఐ వెల్లడించారు. బాలికకు సంబంధించిన ఘటనపై సమాచారం అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. దర్యాప్తులో లభించిన సమాచారం, విచారణ ఆధారంగా నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్న అనంతరం చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు, అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో బాలిక వివరాలను గోప్యంగా ఉంచుతూ పోక్సో చట్టం కింద దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఐ చరమందరాజు స్పష్టం చేశారు. బాలికలు, మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలకు పాల్పడే వారికి చట్టపరమైన పరిణామాలు తప్పవని హెచ్చరించారు. బాలికల భద్రతకు సంబంధించి ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు

# ప్రతీ ఆటో కార్మికుడికి బాకీ పడ్డ 36 వేల రూపాయలను ఎప్పుడు చెల్లిస్తావ్ రేవంత్ రెడ్డి

**: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ .**

**కుత్బుల్లాపూర్. సెప్టెంబర్.6 ప్రజా న్యూస్ నెట్వర్క్**

కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనలో భాగంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజులపాటు నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు "మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ విఫలం, ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పి మోసం చేసిన తీరును" నిరసిస్తూ బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆధ్వర్యంలో సుచిత్ర చౌరస్తా నుంచి జీడిమెట్ల గాంధీ విగ్రహం వరకు ఆటో కార్మికులతో కలిసి బిఆర్ఎస్ శ్రేణులు భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ....

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆచరణకు సాధ్యం కానీ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆటో కార్మికులను రోడ్డున పడేసింది.

ప్రతి ఆటో కార్మికుడికి సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సంవత్సరాలైనా 12 వేల రూపాయల కాదు కదా 12 పైసలు కూడా ఇవ్వకుండా ఆటో కార్మికులను మోసం చేసింది.

మూడు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం ఒక్కో ఆటో కార్మికుడికి 36వేల రూపాయలను బాకీ ఉందని, రేవంత్ రెడ్డి ఈ బాకీ ని ఎప్పుడు చెల్లిస్తారో ఆటో కార్మికులకు స్పష్టం చేయాలి.

హైదరాబాద్ నగరంలో రాత్రి అయితే చాలు చిమ్మ చీకట్లు అలుముకుంటున్నాయి. కొత్త వీధి దీపాల ఏర్పాటును పక్కకు పెడితే ఉన్న వీధి దీపాల నిర్వాహణను కూడా నిర్వహించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉంది.

నగరంలో ఎక్కడ ఏ రోడ్డు చూసినా డ్రైనేజీ మూతలు కుంగడం వాటిని మార్చకపోవడంతో వాహనదారులు, పాదాచారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలకు మౌనిక వసతులను కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది.

వేగంగా విస్తరిస్తున్న నార్త్ హైదరాబాద్ నగరాన్ని పక్కకు పెట్టి సీఎం తన ఊహల నగరమైన ఫోర్త్ సిటీకి అధిక ప్రాధాన్యతనిస్తూ హైదరాబాద్ నగర ప్రజలను విస్మరిస్తున్నారు.

వేగంగా విస్తరిస్తున్న నార్త్ హైదరాబాద్ సిటీకి మెట్రో రైలు మార్గం ఎంతో అవసరం. కానీ ప్రభుత్వం మాత్రం నార్త్ హైదరాబాద్ సిటీని పక్కకు పెట్టి ఫోర్త్ సిటీ పేరుతో రాజకీయాలు చేస్తూ ఇక్కడి ప్రజలను మోసం చేస్తుంది. ఇదే విషయంలో మెట్రో సాధన సమితి సభ్యులు, ప్రజల పక్షాన మేము ఎన్ని సార్లు ధర్నాలు చేసినా ప్రభుత్వంలో మాత్రం ఎటువంటి చలనం లేదు.

ఫోర్త్ సిటీలో కనీసం ఒక పుట్టు, ఒక మనిషి నివసించే పరిస్థితి లేదు. అలాంటి నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామంటూ నానా హైరానా చేస్తూ హైదరాబాద్ మహానగరాన్ని మూడు ముక్కలు చేసి మౌలిక వసతులను కల్పించకుండా ప్రజలకు తీవ్ర అవస్థలు కలిగిస్తున్నారు.

యధా రాజా తధా ప్రజా.... అనే విధంగా రాష్ట్రంలో గుంపు మేస్త్రి వ్యవహరిస్తుంటే స్థానికంగా ఉన్న కొందరు కాంగ్రెస్ నాయకులు కార్లల్లో కొబ్బరికాయలు పెట్టుకొని తిరుగుతూ ఎక్కడపడితే అక్కడ కొబ్బరికాయలు కొడుతూ చెడ్డి గ్యాంగ్ లా కొబ్బరికాయల గ్యాంగ్ తయారయ్యారు.

మరికొన్ని ప్రాంతాల్లో అయితే సంక్షేమ సంఘాల సభ్యులను బ్రతిమిలాడి చీకట్లలో ఉన్న వారి రాజకీయ భవిష్యత్తులో చివరి ప్రయత్నంగా నానా హైరానా చేస్తూ ఫోటో ఫోజుల కోసం, వారి అధిష్టానం మెప్పుకోసం, లేనిది ఉన్నట్లుగా అర్హత లేకున్నా కొబ్బరికాయలు కొడుతూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారు.

ఇకనైనా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ కొబ్బరికాయల చిల్లర రాజకీయాలను బంద్ చేయాలి. ప్రజలు అంతా గమనిస్తా ఉన్నారు. మీరు ఎన్ని వేషాలు వేసిన ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా కెసిఆర్ ని కోరుకుంటున్నారు. రానున్న ఎన్నికల్లో కెసిఆర్ మళ్లీ సీఎం అవ్వడం కాయం.... కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అవ్వడం ఖాయం

ఈ



కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన వివిధ మున్సిపాలిటీల మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు



# గౌడిచెర్లలో బీఆర్ఎస్ నిరసన.. ఆరు గ్యారెంటీలపై తీవ్ర విమర్శలు

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ తేదీ 06.09.2026..

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గౌడిచెర్ల గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ ఆందోళన నిర్వహించినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. "ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయి? వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు ఇంటింటికీ వెళ్లి హామీలపై అవగాహన కల్పిస్తామని నాయకులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసి ప్రజల పక్షాన పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు అన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



# సంగారెడ్డిలో డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ 10వ రాష్ట్ర మహాసభలు..




(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ తేదీ.06.09.2026...

డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (ణూూూ) ఆధ్వర్యంలో 10వ రాష్ట్ర మహాసభలు ఆదివారం సంగారెడ్డిలో నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కార్యక్రమం కొనసాగనుంది.

ఈ మహాసభల్లో విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయుల ఇబ్బందులు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం తదితర అంశాలపై ప్రధానంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రైవేట్ యాజమాన్యాల జోక్యం, విద్యా రంగంలో ఎదురవుతున్న సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సంఘం తన డిమాండ్లను మహాసభల్లో ప్రస్తావించనుంది.

ప్రధాన డిమాండ్లు:

విద్యా రంగంలో సరైన ప్రాధాన్యత కల్పించాలి.

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.

విద్యా రంగంలో ప్రభుత్వ పెట్టుబడులను పెంచాలి.

విద్యార్థులు, ఉపాధ్యాయులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి.

ప్రైవేట్ విద్యా సంస్థలపై సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండాలి.

విద్యా రంగ పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యా రంగానికి చెందిన ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు.




# గాజులరామారంలో కోటి దీపోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

**ఆధ్యాత్మిక వైభవానికి గాజులరామారం వేదిక**

**- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్. సెప్టెంబర్. 6. ప్రజా న్యూస్ నెట్వర్క్ ..

గాజులరామారం: ఆధ్యాత్మికత, భక్తిభావం, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిర్వహించనున్న కోటి దీపోత్సవం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆదివారం ఆవిష్కరించారు.గాజులరామారంలోని చితారమ్మ ఆలయ ప్రాంగణంలో నకులేశ్వరిదేవి సిద్ధి పీఠం వారి ఆధ్వర్యంలో ఈ కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించిన కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ప్రజల్లో మరింతగా పెంపొందించేందుకు ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు.

కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అంతయ్య గౌడ్, ఇంద్రసేనారెడ్డి, బాలరాజ్ శ్రీ నకులేశ్వరిదేవి సిద్ధి పీఠం ప్రతినిధులు నందు పంతులు స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, మోతే శ్రీనివాస్ యాదవ్,ఆర్వ వెంకట్, ప్రభాకర్ రెడ్డి, షాకీర్,తోసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షర శిల్పులకు నీరాజనం ఉత్తమ ఉపాధ్యాయురాళ్లు విజిత కేశవ లక్ష్మీదేవిలకు ఘన సన్మానం

## -గౌతమ్ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభ

నెల్లూరు 06 ప్రజాన్యూస్ నెట్ వర్క్ :

విద్య అంటే కేవలం పుస్తకాల్లోని అక్షరాలు దిద్దించడం కాదు అజ్ఞానపు చీకట్లను పారద్రోలి, ఒక తరాన్ని సుజ్ఞాన కాంతుల వైపు నడిపించే పవిత్ర యజ్ఞం. ఆ యజ్ఞంలో తమ జీవితాలనే సమిధలుగా మార్చి విద్యాబోధనను వృత్తిగా కాకుండా దైవకార్యంగా భావించే అక్షర మూర్తులు ఉపాధ్యాయులు. కన్నతల్లి శరీరాన్ని ఇస్తే, అక్షరాల అమ్మగా నిలిచి పిల్లల భవిష్యత్తుకు ప్రాణం పోస్తూ విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందిస్తున్న ఇద్దరు మహోన్నత ఉపాధ్యాయురాళ్లు శ్రీమతి గుడిపాటి విజిత, శ్రీమతి గుండ్రెడ్డి కేశవ లక్ష్మీదేవిలను గౌతమ్ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ శనివారం ఘనంగా సత్కరించింది. అసోసియేషన్ వ్యవస్థాపకులు శ్రీ అరవ అయ్యప్ప గారి నేతృత్వంలో నిర్వహించిన ఈ అభినందన సభలో అరవ రాయప్ప ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయురాళ్లను శాలువా పూలమాలలు, బుద్ధ విగ్రహంతో అత్యంత వైభవంగా సన్మానించారు

**అక్షర తపస్విని మాతృమూర్తి శ్రీమతి విజిత**

కలువాయి మండలం చవటపల్లి ఎస్జీటీ ఉపాధ్యాయురాలైన గుడిపాటి విజిత స్వగ్రామం నెల్లూరు రూరల్ సౌత్ మోపూరు. గుడిపాటి సుబ్బరాయుడు రమణమ్మల ముద్దుల కుమార్తె అయిన విజిత చిన్నతనం నుంచే చదువుపై అమితమైన శ్రద్ధ కనబరిచారు. గ్రామంలోని వాణిశ్రీ హైస్కూల్లో పాఠశాల విద్యను నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. భర్త ఏ.వి. సుబ్రహ్మణ్యం అందించిన అపూర్వ సహకారం, తోడ్పాటుతో బీఈడీ పూర్తి చేసి 1998లో ఉపాధ్యాయురాలిగా అక్షర ప్రయాణం ప్రారంభించారు

పాఠశాల పరిసరాలను దేవాలయంగా పసి పిల్లలను తన సొంత బిడ్డలుగా భావించే విజిత, నిరంతరం చిరునవ్వుతో ప్రేమాభిమానాలతో పాఠాలు బోధిస్తారు. ఏ రోజూ కేవలం వేతనం కోసం పనిచేయక, క్రమశిక్షణతో కూడిన బాధ్యతాయుత విద్యను అందిస్తూ ఆ గ్రామంలోని విద్యార్థుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. తెలంగాణ గవర్నర్ అవార్డు కంటే నా చిన్నారుల చిట్టి చేతులు ఆప్యాయంగా అందించే పండ్లు తాంబూలమే నాకు మిన్న అని చెప్పే ఆమె మాతృ హృదయం ఎందరికో ఆదర్శం. అంతేకాక, తెలుగు భాషపై ఉన్న మమకారంతో మధురమైన కవితలు రాస్తూ, పిల్లలకు ఒత్తిడి లేని ఆనందకర వాతావరణంలో చదువు నేర్పిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

**శ్రీమతి విజిత గారి పురస్కారాల వైభవం**

సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా తిరుపతి పట్టణంలో మహాత్మా జ్యోతిరావు పూలే ఫౌండేషన్ 2023 ఆధ్వర్యంలో తెలంగాణ మాజీ గవర్నర్ శ్రీమతి తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక సావిత్రిబాయి పూలే ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు.

నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు పొందారు.

నెల్లూరు విశ్వబ్రహ్మ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఆత్మకూర్ రాఘవచారి, ప్రధాన కార్యదర్శి పోకూరు శ్రీనివాస్ ఆచారి, జిల్లా కన్వీనర్ తిరువల్లూరు రమేష్ ఆచారి, ఉపాధ్యక్షులు మహిమలూరు రమణయ్య ఆచారి రాష్ట్ర కార్యదర్శి కాపులూరు కృష్ణ ఆచారి, పట్నం మల్లికార్జున ఆచారి ఎన్నార్ రమణయ్య ఆచారి, ఆచారం వెంకట సుబ్రహ్మణ్యం ఆచారి, కోశాధికారి సుధాకర్ ఆచారీల చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్నారు.

అంకితభావానికి నిదర్శనం శ్రీమతి కేశవ లక్ష్మీదేవి

సైదాపురం మండలం మర్లపూడి పాఠశాలలో ఎస్జీటీ ఫిజిక్స్ ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్న శ్రీమతి గుండ్రెడ్డి కేశవ లక్ష్మీదేవి భర్త వెంకట వరప్రసాద్ కూడా తమ వృత్తిధర్మంతో అంకితభావాన్ని చాటుకుని, విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతూ ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ద్వారా ఘన సన్మానం పొందారు.

**అమ్మల ఆశయ సాధకులుగా పిల్లలు**

విద్య విశిష్టతను సమాజానికి చాటిన ఈ ఇద్దరు ఉపాధ్యాయురాళ్ల పిల్లలు ఉన్నత విద్యనభ్యసించి సమాజానికి సేవలు అందిస్తుండటం విశేషం విజిత గారి కుమారుడు ఏ. నాగా పరబ్రహ్మ వీడీదీూ కోడలు ప్రవళిక వీఎమీూ, వీణ హైదరాబాదులో వైద్యులుగా సేవలందిస్తుండగా... కేశవ లక్ష్మీదేవి గారి కుమార్తెలు టి. భావన వెంకట్ ఇంజనీర్‌గా, టి. సాయి



దీక్షిత హైదరాబాదులో హోమియో వైద్యురాలిగా రాణిస్తున్నారు. ఎన్నో వృత్తిపరమైన బాధ్యతలు ఉన్నప్పటికీ, తమ తల్లులు పొందుతున్న ఈ పురస్కార వేడుకను కళ్లారా చూసి ఆనందించడానికి వీరంతా తరలిరావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.